క్లుప్తంగా

1660 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

చల్లపల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన 1660 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. చల్లపల్లి నారాయణరావు నగర్‌లో ఎల్.రాఘవులుకు చెందిన ఇంటిలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం, తన సిబ్బంది, అవనిగడ్డ డీఎస్పీ బృంద సభ్యులతో కలిసి ఆదివారం దాడి చేశారు. అక్కడ దొరికిన రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి, రాఘవులును అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

చల్లపల్లి: పేకాట ఆడుతున్న ఆరుగురిని చల్లపల్లి పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక కేడీసీసీ బ్యాంకు వెనుక బజారులో ఉన్న ఓ ఇంట్లో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ పి.ఎస్.వి. సుబ్రహ్మణ్యం తన సిబ్బంది, డీఎస్పీ సిబ్బందితో కలిసి ఒక్కసారిగా దాడి చేశారు. అక్కడున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.15,320 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మచిలీపట్నంటౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆ సంఘ నాయకులు, కార్యకర్తలు సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక మల్కాపట్నం గుప్తా సెంటర్‌లోని భారత మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఉన్న ఎమ్మార్పీఎస్ స్థూపం వద్ద సంఘ జెండాను రిటైర్డ్ ఎంపీడీఓ పి.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. మంద కృష్ణమాదిగ జన్మదిన కేక్‌ను 19వ డివిజన్ కార్పొరేటర్ దేవరపల్లి అనిత కట్ చేశారు. ఈడేపల్లి సీఎస్ఐ చర్చి సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ స్థూపం వద్ద జెండాను ఆ సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జ్ జె.నర్సింహారావు ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

మోపిదేవి: ఈనెల 10వ తేదీ గురుపౌర్ణమి సందర్భంగా సామూహిక సాయి సత్యవ్రతాలు మోపిదేవి కెనరా బ్యాంకు వెనుక భాగంలో నిర్వహించనున్నట్లు సాయి సేవక్ నూతక్కి శివబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తేదీ ఉదయం 5.15 గంటలకు సాయిబాబా వారికి కాకడ హారతి, 6 గంటలకు సుప్రభాతం, 7 గంటలకు అభిషేకాలు, 8 గంటలకు ఉచిత సామూహిక సాయి సత్యవ్రతం, విరాట్ సాయి స్తోత్రం, బాబావారి నిత్యప్రార్థన పఠనం, 10 గంటలకు పూజ్యగురుదేవుల వద్ద దీక్ష తీసుకున్న సాయి సేవక్ వి.నాగ పోతరాజుచే బాబావారి భజన పాటలు, సత్సంగ ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు భగవాన్ శ్రీ షిరిడి సాయి బాబావారికి హారతి ఉంటుందని వివరించారు. సత్యవ్రతానికి అవసరమైన పూజా సామగ్రిని భక్తులే వెంట తీసుకురావాలని సూచించారు.

సమ్మె నోటీసులు అందజేత

ఘంటసాల: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మె నోటీసులను విద్యా శాఖ, పంచాయతీ కార్యదర్శులకు కార్మికులు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఘంటసాల ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో 2 ఎండీ మోమిన్‌కు మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ శానిటేషన్ కార్మికులు, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మికి పంచాయతీ కార్మికులు సమ్మె నోటీసులు అందించారు.

10లోపు అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోవాలి

ఘంటసాల: అన్నదాత సుఖీభవకు అర్హత కలిగిన రైతులు ఈ నెల 10వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవడంతో పాటు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.పద్మజారాణి సోమవారం తెలిపారు. ఘంటసాల మండలంలో అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకానికి 9643 మంది రైతులు అర్హులుగా నమోదు చేసినట్లు చెప్పారు. వీరిలో 77 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ పథకంలో 2157 మందిని అనర్హులుగా గుర్తించామని, వారిలో ఎవరైనా అర్హులుగా ఉంటే సంబంధిత పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈకేవైసీ చేయాల్సిన రైతులు, దరఖాస్తు చేసుకునే రైతులు ఈ నెల 10లోపు చేయించుకోవాలని ఏవో పద్మజా రాణి కోరారు.

సమ్మెను జయప్రదం చేయాలని ప్రచార జాత

చల్లపల్లి: ఈనెల 9వ తేదీన జరిగే సమ్మెను కార్మికులందరూ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పోలినాయుడు పిలుపునిచ్చారు. సోమవారం చల్లపల్లిలో ప్రచార జాత నిర్వహించారు.

సునీతకు పీహెచ్‌డీ ప్రదానం



మచిలీపట్నంటౌన్: నగరానికి చెందిన యన్నం సునీత ఇటీవల ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఇంగ్లిషులో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. డైవర్జెంట్ థీమాటిక్ కన్సెర్న్స్ ఇన్ ది సెలెక్ట్ నవల్స్ ఆఫ్ అమిత్ చౌదరి అనే అంశంపై ఆంగ్లంలో పరిశోధనా వ్యాసంకు ఆమెకు ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సునీతను పలువురు అభినందించారు.

మంగళాపురం దళితవాడలో దాహం కేకలు

- ఇన్‌లెట్ పైపును పగలగొట్టిన ఆకతాయిలు
- నాలుగు రోజులుగా అవస్థలు
- బిందెడు నీటి కోసం నానా తిప్పలు



మంగళాపురం దళితవాడలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్



ఆకతాయిలు పగలకొట్టిన పైపులైను

చల్లపల్లి: మండల పరిధిలోని మంగళాపురం దళితవాడలో గత నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా లేకపోవటంతో ఆయా ప్రాంత ప్రజలు బిందెడు నీళ్ల కోసం నానా తిప్పలు పడుతున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఒకటవ, రెండవ వార్డులకు చెందిన ఈ దళితవాడలో సుమారు 250 కుటుంబాలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. పంచాయతీ వారు మూడు చేతి పంపులను ఏర్పాటుచేశారు. వాటిలో రెండు పనిచేయటం లేదు. గ్రామంలో ఎక్కడ బోరు వేసినా ఉప్పునీరు పడటంతో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. దీంతో మిస్తుబిషి కార్పొరేషన్ కంపెనీ ఆర్థిక సహకారంతో 2017లో ఇక్కడ వాటర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించారు. బోర్ల నుంచి ట్యాంకులో నింపి అక్కడి నుంచి గ్రామంలో ఏర్పాటుచేసిన మంచినీటి కుళాయిల ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్టు సరిపడా నీరు అందించేందుకు ట్యాంకు సరిపోకపోవటంతో ప్రతిరోజూ మూడు పూటలా నీటిని వదలాల్సిన పరిస్థితి నెలకొంది. రోజుకు మూడు సార్లు ట్యాంకు నుంచి నీటిని వదిలితే గానీ నీటి అవసరాలు తీరని పరిస్థితి. పైపులైను పగిలిపోవటంతో ట్యాంకులోకి నీటిని నింపే అవకాశం లేకుండా పోయింది. దీంతో గత నాలుగు రోజులగా స్థానికులు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. ఊరి చివరన ఉన్న కుళాయి, పంపులో నుంచి తెచ్చుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇక వయసు మళ్లిన, అనారోగ్యంగా ఉన్న వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మంచినీటి కుళాయిలు 20 వరకూ ఉన్నా అందులో కొన్ని తుప్పు పట్టి విరిగిపోయి నిరుపయోగంగా మారాయి. మిగిలిన కుళాయిలకు చీలలు లేకపోవటంతో ట్యాంకు నుంచి తాగునీరు వదిలినప్పుడు వృథాగా పోతున్నాయి. వెంటనే పైపులైనుకు మరమ్మతులు చేపట్టి తమ దాహార్తిని తీర్చాలని మంగళాపురం దళితవాడ వాసులు అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు. పాడైపోయిన కుళాయిల స్థానంలో కొత్తవి వేసి తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

పైపులైనుకు రక్షణ లేకుండా పోయింది

ఆకతాయిలు పైపులు పగలగొడుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉంది. పాడైపోయిన పైపులైను వెంటనే బాగుచేయించి తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తాం.

–పేర్ని మాధవేంద్రరావు, ఇన్‌చార్జి కార్యదర్శి, మంగళాపురం

అనారోగ్యంతో నీళ్లు తెచ్చుకోలేకపోతున్నా



నాకు ఆరోగ్యం బాగోదు. వాటర్ ట్యాంకు పనిచేకపోవటంతో బిందెడు నీటి కోసం ఊరి చివరకు వెళ్లాల్సివస్తోంది. అడుగుతీసి అడుగు వేయలేను. నీరు ఎలా తెచ్చుకోగలను.

–ముదునూరి కమలమ్మ

ఆకతాయిలు అందరూ అక్కడే చేరుతున్నారు



రాత్రయితే చాలు ఆకతాయిలు వాటర్ ట్యాంకు వద్ద చేరి అల్లరి చేస్తున్నారు. ట్యాంకుకు వాటర్ ఎక్కించే పైపులను పగలకొట్టారు. వారి వల్ల గ్రామం మొత్తం తాగు నీటి కోసం అల్లాడుతోంది.

–కొల్లూరి యాకోబు

పాడైపోయిన కుళాయిలు బాగుచేయించాలి



కుళాయి పంపులు పాడైపోవటంతో నీరు సరఫరా చేసే సమయంలో నీరు వృథాగా పోతోంది. కుళాయిలను, వాటి పైపులను మార్చి తాగునీటి వృథాని అరికట్టాలి.

–కైతేపల్లి రాఘవులు

పెద్ద ట్యాంకు నిర్మించాలి



ప్రస్తుతం ఉన్న ట్యాంకు సామర్థ్యం గ్రామ అవసరాలకు సరిపోవటంలేదు. రోజుకు మూడు సార్లు నీటిని వదిలితే గానీ సరిపడా నీరు అందదు. పాత ట్యాంకు స్థానంలో కొత్త వాటర్ ట్యాంకు నిర్మించాలి.

–కొల్లూరి బుజ్జి

విద్యుత్ విజిలెన్స్ దాడులు

రూ.8 లక్షల జరిమానా



విద్యుత్ శాఖ అధికారులతో సమావేశమై సూచనలు చేస్తున్న ఆ శాఖ విజిలెన్స్ అధికారులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విజిలెన్స్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో దాదాపు రూ.8 లక్షలను అపరాధ రుసుంగా వసూలు చేశారు. నగర పరిధిలో గృహాలు, వాణిజ్య సముదాయాల విద్యుత్ వినియోగదారుల మీటర్లను విద్యుత్ శాఖ విజిలెన్సు అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వాసు, మచిలీపట్నం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.గోవిందరావు ఆధ్వర్యంలో అధికారులు 34 బృందాలుగా ఏర్పడి 2,559 గృహ సర్వీసులు, 455 వాణిజ్య సముదాయాలు తనిఖీ చేశారు. వాటిలో 230 సర్వీసులకు అదనపు లోడు 356 కే డబ్ల్యూ మొత్తానికి రూ.7,88,600 అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యం చేయడం నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే 94408 12091, 94408 12362, 94408 12363 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు. ఈ తనిఖీలలో మచిలీపట్నం టౌన్ డీఈఈ ఎం.శ్రీనివాసులు, మచిలీపట్నం డి–3 ఏఈ ఎ.రమణ, మచిలీపట్నం డివిజన్ పరిధిలోని డీఈఈలు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు నాగాయలంక విద్యార్థులు



ఏడవ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలలో ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం, పీడీ తదితరులు

నాగాయలంక: కృష్ణాజిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ కేటగిరీలో స్త్రీ, పురుషులకు నిర్వహించిన సీనియర్ బేస్‌బాల్ సెలక్షన్స్‌లో రాష్ట్రస్థాయి జట్టుకు నాగాయలంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు 13మంది(11+2)ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అలపర్తి సత్య నారాయణ సోమవారం తెలిపారు. ఇదే పాఠశాల మైదానంలో ఈనెల 6వ తేదీన జరిగిన సెలక్షన్స్‌లో తమ విద్యార్థులు మైలా దివ్య, పి.హాసిని, బి.జాహ్నవి, పి.లీలానాగశ్వేతశ్రీ, తమ్ము తనుషా, గుంటూరు హాసిని, సముద్రాల మేఘన, సనకా హరనాథ్, కొడాలి వీరేంద్ర, స్టాండ్‌బై క్రీడాకారులుగా పూషడపు వల్లిశ్రీ, ముమ్మారెడ్డి సిరి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12,13,14 తేదీల్లో శ్రీసత్యసాయి జిల్లా అనపర్తిలో జరిగే ఏడవ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలలో కృష్ణాజిల్లా తరఫున ఆడతారన్నారు. ఎంపికైన బాలబాలికలను హెచ్‌ఎం సత్యనారాయణ, పీడీ గాజుల లక్ష్మీప్రసాద్, పీఎంసీ చైర్మన్ వక్కపట్ల లీలామారుతి, పాఠశాల విద్యాకుటుంబం వారు అభినందించారు.

రహదారుల అభివృద్ధికి రూ.8.03 కోట్లు మంజూరు

మోపిదేవి: మండలంలో పలు రహదారుల అభివృద్ధికి రూ.8.03 కోట్లు మంజూరైనట్టు అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ సోమవారం తెలిపారు. అందులో భాగంగా వెంకటాపురం నుంచి పెదకళ్లేపల్లి ప్రధాన రహదారికి నాబార్డు నిధులు రూ.2.60 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. వీటితో పాటు పంచాయతీరాజ్–గ్రామీణ అభివృద్ధి శాఖ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రోడ్ల ప్రాజెక్టు(ఏపీఆర్ఆర్‌పీ) ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) ద్వారా మంజూరైన నిధులతో మోపిదేవి–చల్లపల్లి ప్రధాన రహదారి నుంచి నాగాయితిప్ప గ్రామంలోని పోచిగానిలంక కరకట్ట వరకు గల రోడ్డు నిర్మాణానికి రూ. 1.17 కోట్లు, పెదకళ్లేపల్లి నుంచి మేళ్లమర్రు ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.2.66 కోట్లు, అయోధ్య నుంచి అడపావారిపాలెం వయా అరజావారిపాలెం, కూరేటివారిపాలెం ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ వివరించారు.

వీఓఏల సమస్యలు పరిష్కారానికి వినతి



డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్‌కు అర్జీ సమర్పిస్తున్న వీఓఏల సంఘం ప్రతినిధులు నాని, సాయి తదితరులు

ఘంటసాల/చిలకలపూడి(మచిలీపట్నం): ఏపీ వెలుగు పథకంలో పని చేస్తున్న వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ వెలుగు వీఓఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లూరి నాని, టి.సాయి నాగలక్ష్మి ఆధ్వర్యంలో వీఓఏలు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్‌లకు సోమవారం మీకోసంలో వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు నాని మాట్లాడుతూ ఏపీలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో రాష్ట్ర వ్యాప్తంగా 27,637 మంది, జిల్లాలో 2 వేల మందికి పైగా వీఓఏలు పని చేస్తున్నామన్నారు. సుమారు 28 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద మహిళలను, ఆర్థికంగా, సామాజికంగా చైతన్యవంతులను చేయడంతో పాటు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. తమకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. వీఓఏలకు నేరుగా అకౌంట్‌లోనే వేతనాలు జమ చేయాలని, కనీస వేతనం రూ.25 వేలు ఇప్పించాలని, రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, అర్హులైన వీఓఏలకు సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కలెక్టర్ బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్‌లకు వినతి పత్రాలు ఇచ్చినట్లు నాని చెప్పారు. అర్జీ సమర్పించిన వారిలో నాగమణి, సాయినాగలక్ష్మి, పద్మ, సరళ ఉన్నారు.

రైతులే స్వచ్ఛందంగా రోడ్డు నిర్మాణం



రైతులు స్వచ్ఛందంగా వేసుకున్న రహదారి

కృత్తివెన్ను: చిన్నపాటి చినుకు పడితే తమ గ్రామంలోకి చేపలు, రొయ్యల చెరువులకు అవసరమైన మేత లోడు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని వారు ఎదురుచూడలేదు. రైతులంతా స్వచ్ఛందంగా తమ గ్రామానికి సుమారు 2 కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మాణం కోసం నడుంకట్టారు. కృత్తివెన్ను మండలం గాంధీనగరం గ్రామంలో వెయ్యిమంది జనాభా, 600 ఎకరాల పంట భూములు, చేపలు, రొయ్యల చెరువులున్నాయి. తమ గ్రామానికి ప్రధాన పంటకాలువపై సుమారు 2 కిలోమీటర్లు దూరాన వంతెన నిర్మాణం జరిగింది. అక్కడి నుంచి గ్రామానికి చేరాలంటే మట్టిరోడ్డే దిక్కు. చిన్నపాటి చినుకు పడితే కాలినడక కూడా గగనమే. దీంతో స్థానిక రైతులంతా స్వచ్ఛందంగా రోడ్డు నిర్మాణం చేసుకుంటున్నారు. వారు చేస్తున్న పనికి తోడుగా పాలకులు స్పందించి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసి ఆ గ్రామానికి శాశ్వత రహదారి పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీ జలధీశ్వర స్వామి ఆలయానికి రూ.లక్ష వితరణ



లక్ష విరాళం ఇచ్చిన బాలశశిధర్ కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న రామకృష్ణ

ఘంటసాల: ఘంటసాల గ్రామంలోని శ్రీ బాలపార్వతీ సమేత శ్రీజలధీశ్వర స్వామి వారికి ఎన్నారై సంగుబట్ల వెంకట బాల శశిధర్ – మాధురి దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. అమెరికాలోని నార్త్ కెరోలినాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ తమ మొక్కుబడి తీర్చుకునేందుకు సోమవారం వారు ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయాభివృద్ధి కమిటీ నిర్వాహకుడు గొర్రెపాటి రామకృష్ణకు లక్ష రూపాయలను అందించారు.

అడ్డగోలుగా చెరువుల తవ్వకాలు



జింజేరు గ్రామంలో లజ్జబండ పక్కన కొత్తగా తవ్వుతున్న చెరువు

పెడన: మండల పరిధిలోని లజ్జబండ డ్రయిన్‌ను ఆనుకుని ఉన్న పంట పొలాల్లో అనధికారికంగా చెరువులను తవ్వేస్తున్నారు. నీరు పైకి తన్నుతోందని, గట్టులు వేస్తున్నామనే విషయాన్ని అధికారులకు చెప్పి ఏకంగా చెరువులుగా మార్చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది చూసీచూడనట్లుగా వదిలేస్తూ ఏం జరగడం లేదని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉంది. జింజేరు గ్రామంలోని శ్మశానవాటిక దాటిన తరువాత లజ్జబండను ఆనుకుని ఉన్న పంట పొలాలు బీడువారాయి. దీంతో ఖాళీగా అట్టిపెట్టిన రైతులు వాటిని చెరువులుగా మార్చుతున్నారు. అయితే వీటిని చెరువులుగా మార్చడం వల్ల పక్కనే ఉన్న తమ పంటపొలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పొరుగు రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పక్క శ్మశానాన్ని ఆనుకుని ఉన్న చెరువులో మట్టి తవ్వేస్తూ మరో చెరువుకు గట్టుగా పోయడం గమనార్హం. ఈ విషయాన్ని తహసీల్దారు కె.అనిల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సంబంధిత రైతులను పిలిచి అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంటూ ప్రస్తుతం పనిచేస్తున్న పొక్లయిన్‌లను, జేసీబీలను సీజ్ చేశారని రైతులు తెలిపారు.

మాజీ కౌన్సిలర్ బొర్రా సుధాకర్ మృతి

సంతాపం తెలిపిన పేర్ని నాని, కిట్టు




మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకుడు బొర్రా సుధాకర్(55) సోమవారం మృతి చెందారు. మచిలీపట్నం మాజీ ఎమ్మెల్యే బొర్రా వెంకటస్వామి కుమారుడైన సుధాకర్ 2000 వ సంవత్సరంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 27వ వార్డు నుంచి పోటీ చేసి పట్టణంలో ఇతర కౌన్సిలర్ల కన్నా అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. కొద్ది సంవత్సరాలుగా కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఆయన సోమవారం కన్నుమూశారు. సుధాకర్ మృతి పట్ల మాజీ మంత్రి పేర్ని నాని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కిట్టు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, 18వ డివిజన్ కార్పొరేటర్ మేకల సుబ్బన్న సంతాపాన్ని తెలియజేశారు. సుధాకర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

వైఎస్సార్ సీపీ నేతను పరామర్శించిన పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: బందరు మండలం పెదపట్నం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మల్లిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ఇటీవల గుండెపోటుకు గురై శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు ఆయనకు అండగా నిలవాలని సూచించారు. అనంతరం బైక్ యాక్సిడెంట్‌లో గాయాలపాలై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న బాధితులను కిట్టు పరామర్శించారు.

పీహెచ్‌సీ స్థలదాత తులసీరత్నం కన్నుమూత



చల్లపల్లి: పురిటిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలదాత, కృష్ణసాయి మందిరం(పురిటిగడ్డ) వ్యవస్థాపక అధ్యక్షురాలు, శతాధిక వృద్ధురాలు నాదెళ్ళ తులసీరత్నం(102) సోమవారం కన్నుమూశారు. పురిటిగడ్డలో పీహెచ్‌సీ నిర్మాణానికి గ్రామం నడిబొడ్డున ఉన్న విలువైన 80 సెంట్ల భూమిని దానంగా ఇచ్చారు. తులసీరత్నంకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తలసీరత్నం తనయుడు, రిటైర్డ్ ఆర్టీవో, గ్రామ పెద్ద నాదెళ్ల శివరామకృష్ణ తెలిపారు.

వార్డు సచివాలయ ఉద్యోగులకు రిలీవ్ ఉత్తర్వులు

పెడన: పట్టణంలోని తొమ్మిది సచివాలయాల్లో వివిధ కేటగిరీలలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులను సోమవారం రిలీవ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా పట్టణంలోనే ఒక సచివాలయం నుంచి మరొక సచివాలయానికి బదిలీ కావడంతో తక్షణం రిలీవ్ అయి మరుసటి రోజునే విధుల్లో చేరాల్సిందిగా కమిషనర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు బందరు, పామర్రులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, పామర్రు నియోజకవర్గాల్లో మంగళవారం బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నంలోని ఎంఆర్ ఫంక్షన్ హాలులో ఉదయం 9.30 గంటలకు, పామర్రులోని ఆరేపల్లి కల్యాణ మండపంలో సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు



అవనిగడ్డ: నియోజకవర్గంలో అక్రమాల నిరోధానికి చర్యలు తీసుకుంటుంటే కొంతమంది వద్దని తనకు ఫోన్లు చేస్తున్నారని, అలాంటి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయడంతో పాటు బైండోవర్ పెడతామని డీఎస్పీ టి.విద్యశ్రీ హెచ్చరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో ఎవరన్నా ఇసుక, మద్యం, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ బియ్యాన్ని పట్టుకోవద్దని కొంతమంది ఫోన్లు చేస్తున్నారని, ఇలాంటి విషయాల్లో తనపై ఒత్తిడి తీసుకొస్తే వారిపై షీట్ ఓపెన్ చేయడంతో పాటు బైండోవర్ పెడతామని హెచ్చరించారు. సింగిల్ నంబర్ జూదాన్ని పూర్తిగా అడ్డుకున్నామని చెప్పారు. ఇసుక, మద్యం, బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సహాయం

గూడూరు: మండల పరిధిలోని పోలవరంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలి నిరాశ్రయులైన మురాల లక్ష్మీకుమారి కుటుంబానికి కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వంట సామగ్రి అందజేసింది. సంస్థ కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, అంతర్జాతీయ మానవహక్కుల సంఘం యూత్ ప్రెసిడెంట్ పడవల మోహనత్రినాథ్, కొండపల్లి రామ్ బాలాజీ, హరికృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెడన: మండల పరిధిలోని కూడూరు గ్రామంలోని కొంకేపూడి డ్రెయిన్ వంతెన సమీపంలో టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కూడూరు గ్రామానికి చెందిన కాగిత రామకోటయ్య(56) ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తున్న సమయంలో అదే మార్గంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ రామకోటయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో రామకోటయ్య తలకు తీవ్ర గాయం కావడంతో ఆయనను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పెడన పోలీసులు తెలిపారు.